మురికి కూపంలా మినీ ట్యాంక్‌బండ్

● సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోతున్న వ్యర్థాలు ● దుర్గంధంగా పరిసరాలు



గ్రిల్స్ ఊడిపోయి ప్రమాదకరంగా మారిన దృశ్యం



సరూర్‌నగర్ కట్టపై పేరుకుపోయిన చెత్త



చెరువులో వేసిన వ్యర్థాలు

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు రోజురోజుకు మురికి కూపంగా మారుతోంది. చెరువులో ఎటు చూసినా ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారం కనిపిస్తున్నాయి. అటుగా రాకపోకలు సాగిస్తే ముక్కుపుటలదిరే దుర్వాసన వస్తోందని సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో వ్యర్థాలు వేయకుండా, మురికి నీరు కలువకుండా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతోనే చెరువు కంపు కొడుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాల్సిన మినీ ట్యాంక్ బండ్ ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. చెరువు నీటి శుద్ధి, చెరువులో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించే ప్రయత్నం కూడా చేయకపోవడం దారుణమంటున్నారు.

99 ఎకరాల నుంచి 60 ఎకరాలకు..

1906లో అప్పటి నైజాం రాజు తాగునీరు, వ్యవసాయ అవసరాల కోసం 99 ఎకరాల్లో చెరువును తవ్వించారు. ఇటలీ నుంచి పక్షులు సరూర్‌నగర్ చెరువును విడిదికి స్థావరంగా చేసుకునేవి. నగరం అభివృద్ధి చెందడం చెరువు చుట్టూ ఆక్రమణలకు గురి కావటంతో చెరువు 60 ఎకరాలకు కుంచించుకుపోయింది. పాత సరూర్‌నగర్ మండలంలోని గ్రామాల నుంచి, అక్కడి చెరువుల నుంచి మురుగు నీరు సరూర్‌నగర్ చెరువులో కలుస్తుండటంతో మురికి కూపంలా మారింది. దీనికి తోడు పరిసర కాలనీల ప్రజలు వ్యర్థాలను వేయటంతో కలుషితమవుతోంది. దీంతో వలస పక్షులు రావడం కూడా ఆగిపోయింది. 2003లో స్థానికుల ఆందోళనతో అప్పట్లో రూ.3 కోట్లతో సివరేజీ ప్లాంట్లను ఏర్పాటు చేసినప్పటికి సక్రమంగా పనిచేయకపోవటంతో చెరువు మురుగునీటితో నిండిపోయింది.

ఊడిపోతున్న గ్రిల్స్..

చెరువు అభివృద్ధిలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని పార్కును ఏర్పాటు చేసి బోటింగ్ సౌకర్యం కల్పించారు. నీటిలో నుంచి దుర్వాసన రావడంతో బోటింగ్‌కు ఆదరణ లేకుండా పోయింది.సరూర్‌నగర్ చెరువు సమీప కాలనీల ప్రజలు సాయంత్రం వేళల్లో పిల్లలతో కలిసి సేద తీరేందుకు వస్తుంటారు. కానీ ఇక్కడ దుర్గంధ పూరిత వాతావరణం ఉండటంతో సందర్శకులు అసౌకర్యానికి గురవుతున్నారు. చెరువు నీరు కలుషితం కావడంతో పాటు ఫ్లోరింగ్ టైల్స్ పగిలిపోయి గుంతలమయంగా మారింది. చెరువు చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ సైతం చాలా ప్రాంతాల్లో ఊడిపోయి ప్రమాదరకరంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి సరూర్‌నగర్ చెరువును అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణ కల్పించాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 31, వంకాయ రూ. 40, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 20, బీర రూ. 38, క్యాబేజి రూ. 33, ఫ్రెంచి బీన్స్ రూ. 45, క్యారెట్ రూ. 55, దొండ రూ. 28–35, చిక్కుడు రూ. 55, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 50, క్యాప్సికం రూ. 45, ఆలు రూ. 35, దోస రూ. 23, సొర రూ. 15, పొట్ల రూ. 23, ఉల్లిగడ్డ రూ. 45, చామగడ్డ రూ. 35. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఎగ్జిబిషన్‌కు స్పందన



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్పందన వస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి



ఈటలను కలిసిన నాయకులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు ఎంపీ నిధులు వెచ్చించి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎంపీని కలిసి కాలనీ అభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎంపీని కలిసిన వారిలో విజయ భాస్కర్‌రెడ్డి, అమర్‌నాథ్‌యాదవ్, రాహుల్‌సాగర్, విష్ణువర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ధోబీఘాట్‌లోని సమస్యలన్నీ పరిష్కరిస్తా..

నాగోలు: నాగోలు డివిజన్‌లో ధోబీఘాట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. శనివారం ధోబీఘాట్‌లో నిర్వహించిన శ్రీఈదమ్మ మాత తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆయ పాల్గొని ప్లాంట్, కమ్యూనిటీ కాంపౌండ్ వాల్‌ను పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. ధోబీఘాట్‌లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా నిధుల కొరతతో అసంపూర్తిగా మిగిలిపోయిన ప్రహరీ, కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్ల నిర్మాణ పనులను రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, బి.చుక్కయ్య, బి. సహదేవు ఎంపీ దృష్టికి తీసుకురాగా పనుల పూర్తికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురేందర్ యాదవ్, రమేష్, మధు, మహేందర్ నాథ్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

నేడు వనభోజన మహోత్సవం

వనస్థలిపురం: వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సచివాలయనగర్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిఆలయ ప్రాంగణంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు సామూహిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు, అనంతరం భోజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

◆ వనస్థలిపురంలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్జీవోస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌లో 37వ కార్తీకమాసం వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఐ.శివకోటేశ్వర్‌రావు, ఎం.పున్నయ్య తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధిలోని ఎల్లారెడ్డి కాలనీ నుంచి పవన్‌గిరికాలనీ వరకు జరుగుతున్న ట్రంక్‌లైన్, సీసీ రోడ్డు పనులను శనివారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసులు స్వచ్ఛందంగా ర్యాంపులు, ట్రీగార్డులను తొలగించుకున్నారని, దీంతో రోడ్డు విశాలంగా నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సందీప్, నాగేశ్వర్‌రావు, నర్సింహా, వేణుగోపాల్ రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సాయిరాంగౌడ్, జయతేజ, యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

పాఠశాల స్థలాన్ని పరిరక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

నాగోలు: బండ్లగూడ ప్రాథమిక పాఠశాల స్థలాన్ని కాపాడాలని పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు శనివారం ఉప్పల్ మండల తహసీల్దార్ వాణిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పాఠశాల పక్క భవన నిర్మాణం కోసం 1998లో ఎకరం స్థలాన్ని కేటాయించారని ఈ స్థలంలో 278 గజాల స్థలం తమదని కొందరు ప్రైవేటు వ్యక్తులు వివాదాన్ని సృష్టించి కోర్టులో దావా వేయగా పాఠశాలకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. దీంతో పాఠశాల నిర్మాణానికి పూనుకోగా సదరు వ్యక్తులు హై కోర్టులో దావా దాఖలు చేసి పాఠశాల నిర్మాణాన్ని నిలుపుదల చేశారని వినతిలో పేర్కొన్నారు. ప్రస్తుతం బండ్లగూడ ప్రాథమిక పాఠశాల ఓ ప్రైవేటు భవనంలో రెండుఇరుకు గదుల్లో 120 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉంటున్నారని ఆ భూమిని సర్వే చేయించి పాఠశాలకు కేటాయించి భవన నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వినతి ఇచ్చినవారిలో సహదేవ్‌గౌడ్, రాందాసు,గణేష్, ఎమ్మెస్ చారి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని లింగోజిగూడ ఓల్డ్ విలేజ్‌కు చెందిన సీహెచ్ శ్రీనివాస్‌కు మంజూరైన రూ.60 వేల చెక్కును శనివారం రాజశేఖర్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. అర్హులంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, కిట్టు, రమణ, కరుణ్‌కుమార్, యశ్వంత్, ఆనంద్‌రాజ్, రాంబాబు, సతీష్, శ్రీధర్‌గౌడ్, గౌస్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీఐటీయూ నేతలు

మన్సూరాబాద్: బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న రైతుకార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 26న ఇందిరాపార్కు వద్ద చేట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్‌లో శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థ, ధనవంతులపై ఆదాయ పన్ను పెంచి విద్యా, ఆరోగ్య, వ్యవసాయ రంగాలకు కేటాయించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతాలను పెంచాలని, బొగ్గు బ్లాక్‌ల వేలంను నిలుపుదల చేసి సింగరేణికే నేరుగా గనులను కేటాయించాలని కోరారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్‌పై కేంద్ర సుంకాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, భాస్కర్, లింగం, లింగస్వామి, సుధీర్, నర్సింహ్మా, మధు పాల్గొన్నారు.

స్త్రీశక్తి భవనానికి మరమ్మతు చేయాలి



స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

లింగోజిగూడ: అధ్వానంగా మారుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు మరమ్మతు చేయాలని సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి కోరారు. హయత్‌నగర్ మండల కార్యాలయ ఆవరణలో ఉన్న స్త్రీశక్తి భవనాన్ని శనివారం సీపీఐ నాయకులు పరిశీలించి మాట్లాడారు. స్త్రీ శక్తి భవనం నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. ధ్వంసమైన తలుపులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాతరాజు నర్సింహా, బోయపాటి రాములుగౌడ్, కుందుల సుధాకర్, రమావత్ సక్రు పాల్గొన్నారు.


జలమండలి అధికారులు తీరు మార్చుకోవాలి



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్: వరద కాలువలోకి డ్రైనేజీ మురుగు నీటిని కలిపితే ఊరుకునేది లేదని సెంట్రల్‌బ్యాంక్ కాలనీవాసులు హెచ్చరించారు. కాలనీలోని వరద కాలువ వద్ద జలమండలి అధికారులు తవ్విన గుంత వద్ద శనివారం కాలనీవాసులు ఆందోళన చేస్తూ మాట్లాడారు. జలమండలి అధికారులు బహుళ అంతస్తుల నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్నారన్నారు. వరద కాలువలోకి డ్రైనేజీ మురుగును కలుపమని జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు కాలనీవాసులకు హామీ పత్రం ఇచ్చారని, ఇప్పుడు కాలనీవాసులను సంప్రదించకుండానే వరదకాలువలోకి కలిపేందుకు ప్రయత్నించడం పద్ధతి కాదన్నారు. కాలనీవాసులంతా కలిసి నిర్మాణ పనులను అడ్డుకున్నామని, భవిష్యత్తులోనూ అడ్డుకుంటామన్నారు. జలమండలి ఈ ప్రాంతంలో కాకుండా చంద్రపురికాలనీకి వచ్చే ప్రాంతంలో కలిపేందుకు ప్రణాళికలు చేస్తున్నారనే సమాచారం ఉందని, ఆ ప్రాంతంలో కూడా పనులను అడ్డుకుంటామన్నారు. జలమండలి అధికారులు తమ తీరు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జక్కిడి తిరుమల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఠాకూర్ రాకేష్‌సింగ్, కాలనీవాసులు విద్యాసాగర్, భైరవ రెడ్డి, కృష్ణప్రసాద్,గోవర్ధన్‌రెడ్డి, సురేష్‌కుమార్‌గౌడ్, సుబ్రహ్మణ్యం, గోపాల కృష్ణమూర్తి, కోతి రెడ్డి, వినోద్‌ప్రసాద్ తివారి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘దళితబంధును అమలు చేయాలి’



జనపాల మధు

చంచల్‌గూడ: దళితబంధు పథకం అర్ధాంతరంగా రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పునఃప్రారంభించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జనపాల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితబంధు పథకం కొందరికే అందిందని దరఖాస్తు పెట్టుకున్న వారందరికీ అందేలా చూడాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతో దళిత బంధు పథకం ఆపడం దుర్మార్గమన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



నాగోలు: ఆర్థిక సమస్యలతో బాధపడుతూ ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. సూర్యపేట విద్యానగర్‌కు చెందిన యానాల గంగాధర్‌రెడ్డి(52)మన్సూరాబాద్ హిమపురికాలనీలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతూ మద్యానికి బానిసయ్యాడు. గత 10 రోజులుగా బాలానగర్‌లో ఉండి శుక్రవారం హిమపురికాలనీకి వచ్చాడు. రాత్రి కామినేని దారిలోని షిర్డీ సాయిబాబా దేవాలయం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు హేమంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైతుల మేలుకు కృషి చేయండి



వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: సుదూర ప్రాంతాల నుంచి తమ పంటలను అమ్ముకునేందుకు మార్కెట్‌కు వచ్చే రైతుల మేలు కోసం మార్కెట్ కమిటీలు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి వైస్ చైర్మన్‌గా నియమితులైన కోట్ల శ్రీనివాస్ శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులకు మద్దతు ధర, వ్యాపారులకు గిట్టుబాటు కలిగేలా మార్కెట్ పాలకవర్గాలు సంధానకర్తలుగా వ్యవహరించాలని సూచించినట్లు కోట్ల శ్రీనివాస్ తెలిపారు.

చలాన్లు చెల్లించి వాహనాలు తీసుకెళ్లండి

నాగోలు: వివిధ కేసుల్లో పట్టుకున్న వాహనాల చలాన్లు చెల్లించి, సరైన పత్రాలు చూపి తీసుకెళ్లాలని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల నిబంధనల ఉల్లంఘన కేసుల్లో పట్టుబడిన 61 ద్విచక్ర వాహనాలు సరూర్‌నగర్ పార్కింగ్ యార్డులో ఉన్నాయని సరైన పత్రాలను చూపి తీసుకెళ్లాలని పూర్తి వివరాలకు 8712662773 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బైక్‌ల చోరీకి పాల్పడుతున్న మైనర్లు



వాహనాలను చూపిస్తున్న పోలీసులు

జువైనల్ హోంకు తరలింపు

నాగోలు: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి ఇతర ప్రాంతాల్లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు మైనర్‌లతో పాటు 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సూర్యనాయక్ వివరాల ప్రకారం.. నాగోలు సాయినగర్‌లో నివాసముండే ఇద్దరు మైనర్లు షాపింగ్ కాంప్లెక్స్‌లో, ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాల చోరీలకు పాల్పడుతున్నారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం ఇద్దరిని అదుపులోకి తీసుకుని జువైనల్ హోం తరలించారు.

సత్యసాయిబాబాకు పూజలు



పూజ చేస్తున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: విశ్రాంతి ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శనివారం సత్యసాయి బాబా జన్మదినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చెరుకూరి గ్రూప్ చైర్మన్ రామరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

10 మంది నకిలీ వైద్యులపై కేసు



చంపాపేట: నకిలీ వైద్య వ్యవస్థను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో టీఎంసీ అధికారులు చంపాపేట, కర్మన్‌ఘాట్, ఐఎస్‌సదన్‌లోని 20 క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. నియమాలకు విరుద్ధంగా క్లినిక్‌లలో బెడ్స్ ఏర్పాటు, రోగులకు సెలైన్ పెట్టడం, యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజక్షలను ఇస్తున్నట్లు గుర్తించిన అధికారుల బృందం వాటికి సంబంధించిన ఆధారాలు సేకరించారు. తమ తనిఖీలలో 10 మంది నకిలీ వైద్యులు పట్టుబడ్డారని, వారిపై కేసులు నమోదు చేస్తామని శ్రీనివాస్ తెలిపారు. మహిళా ఆయుర్వేదిక్ వైద్యురాలు డాక్టర్ రాధాకుమారి, ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ వీరేష్ నియమాలకు విరుద్ధంగా అలోపతి మందులు ఇస్తున్నట్లు గుర్తించామని వారిపై ఆయుష్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

నాగోలులో క్లినిక్ సీజ్..



నాగోలులో ఓ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

నాగోలు: నాగోలు డివిజన్‌లో హియరింగ్ క్లినిక్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రంగనాథ స్వామి, కీసర డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యవతి ఇతర సిబ్బందితో కలిసి నాగోల్ డివిజన్‌లోని సత్యం హియరింగ్ క్లినిక్ తనిఖీలను నిర్వహించారు. సత్యం హియరింగ్ క్లినిక్ హన్మిరెడ్డికి ఎలాంటి అర్హతలు లేకున్నా క్లినిక్‌ను నడుపునట్లు గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు.

యువకుడి అదృశ్యం

లింగోజిగూడ: ఇంట్లో నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పెద్ద అంబర్‌పేట రాంనగర్‌కు చెందిన ఏదుల అరుణ్‌కుమార్(22) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం పెద్ద అంబర్‌పేటలో ఉంటూ డ్రైవింగ్ చేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అరుణ్‌కుమార్‌కు కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా పనిచేయడం లేదు. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

నాగోలు: విద్యార్థులకు సామాజిక అంశాల పట్ల అవగాహన అవసరమని ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జైపురికాలనీ ప్రాథమిక పాఠశాలలో శ్రీనిధి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు కుమారి ఉర్వి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సర్వీస్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం పరిశుభ్రత వ్యక్తిగత అలవాట్లు, రోడ్డు భద్రత ట్రాఫిక్ అంశాలపై అవగాహన కల్పించారు.

ఫోన్ నంబర్ హ్యాక్ చేసి.. రూ. 1.35 లక్షలు కొట్టేసి

నాగోలు: ఫోను నంబరర్ హ్యాక్ చేసి క్రెడిట్ కార్డుల్లోని నగదును కొల్లగొట్టిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హస్తినాపురం నార్త్, కస్తూరి కాలనీకి చెందిన పల్లా వెంకట్‌రెడ్డి (41) ప్రైవేట్ ఉద్యోగి. అతడి వాట్సాప్ నెంబర్‌కు నకిలీ పీఎం కిసాన్ యోజనకు సంబంధించిన ఫైల్ వచ్చింది. ఆ ఫైల్‌ను ఓపెన్ చేయగానే అతని ఫోన్ హ్యాక్ అయ్యి ఇండస్ ల్యాండ్, ఆర్‌బీఎల్ క్రిడిట్ కార్డులు నుంచి రూ. 1,35,528 లక్షల నగదు వేరే ఖాతాల్లోకి బదిలీ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.